నేడు పీర్జాదిగూడలో ప్రజావాణి

మేడిపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, మేయర్ జక్క వెంకట్ రెడ్డిలు వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. ప్రతి సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నిర్వహించే ప్రజావాణి అవకాశాన్ని ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేసి సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు నిర్వహించారు. ప్రతి నెలా రెండో ఆదివారం కల్యాణం నిర్వహిస్తున్నామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. క్లర్క్ సుధాకర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పేరణి శ్రీనివాస్ శిష్యబృందంచే నిర్వహించిన ఆంధ్రా నాట్యం నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. వినాయక కౌతం, గంగాధర, ఆగణిత, నిన్ను మంచిన, సరస్వతి, దశావతారాలు, తిల్లాన, నవగ్రహాలు, ప్రవేశ దరువు తదితర అంశాలను ఆక్షయ చర్య, నందిత, హారిక రెడ్డ, అద్వయ, చతుర్వి, మనస్విని, వర్ష, శ్రీనిధి, అధితి దాస్ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నాచా రం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. ఆదివారం నాచారం రాఘ వేంద్రనగర్ కాలనీలోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌కు వెళ్లే దారిలో రూ.54 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు ఆగిపోయాయన్నారు. రాఘవేంద్రనగర్ కాలనీలో దాదాపు 90 శాతం సీసీ రోడ్లను వేశామని తెలిపారు. మిగతా పనులను మంజూరు చేయించి త్వరలోనే పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్‌ఎస్ నేతలు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, శ్రీను నాయక్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కీసరలో అంబేడ్కర్‌కు జ్ఞానమాల



జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొన్న చీర్యాల మాజీ సర్పంచ్ పులగుర్ల లావణ్య

కీసర: అంబేడ్కర్ సంఘం కీసర మండల శాఖ ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చీర్యాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పులగుర్ల లావణ్య శ్రీనివాస్ పాల్గొని, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అంబేడ్కర్ మహోన్నతమైన వ్యక్తి అని ప్రశంసించారు. మేడ్చల్ జిల్లా వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, కీసర రామాలయ చైర్మన్ నాయకపు వెంకటేశ్, అంబేడ్కర్ సంఘ అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సత్కారం



కళారత్న ఎసీపీ.భారతిని సత్కరిస్తున్న దృశ్యం

గౌతంనగర్: తెలంగాణ సాంస్కృతిక సంబరాల సరాగాల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కళాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సారసత్వ పరిషత్ ఆడిటోరియంలో ఆదివారం పలువురు కళాకారులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, తెలుగు సినిమా దర్శకులు డాక్టర్ ఎ.కె.రాములు, గౌతంనగర్‌కు చెందిన కళారత్న, నాట్యగురు లయన్ ఎస్‌పీ.భారతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర కాలనీ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కాలనీ సభ్యులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ శ్రీ వేంకటేశ్వర కాలనీ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్ల వినయ్‌శంకర్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.నారాయణమూర్తి, జాయింట్ సెక్రటరీగా అనిల్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటాం

- గత అనుభవాలు దృష్ట్యా సిబ్బంది అప్రమత్తం
- ఉప్పల్‌కు ముంపు సమస్య లేదు : ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్



ఉప్పల్ సర్కిల్‌లో సిద్ధమైన మాన్‌సూన్ టీం

ఉప్పల్: వర్షాకాల సీజన్‌లో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి జీహెచ్‌ఎంసి ఉప్పల్ సర్కిల్ మాన్‌సూన్ సిబ్బంది సిద్ధమయ్యారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. నైరుతి రుతుపవనాలు ముందే పలకరించడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. హైదరాబాద్‌కు భారీ వర్ష సూచనలు ఉన్నాయని వాతావారణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఇప్పటికే జీహెచ్‌ఎంసి కమిషనర్, మేయర్ ఆయా సర్కిళ్లకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చెప్పారు. దీంతో ఉప్పల్ సర్కిల్ అధికారులు అప్రమత్తమయ్యారు. జూన్ ఒకటవ తేదీ నుంచి మాన్‌సూన్ సిబ్బందిని రంగంలో దించారు. ప్రతి వార్డుకు ఒక టీం చొప్పున సర్కిల్ పరిధిలోని నాలుగు వార్డులకు నాలుగు టీంల చొప్పున కేటాయించారు. ప్రతి టీంలో నలుగురి బృందం సర్కిల్ కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. దాదాపుగా రూ. 65 లక్షల అంచనా వ్యయంతో అక్టోబర్ చివరి వరకు ఈ టీం కొనసాగనుంది. అత్యవసర సమయాల్లో అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటే మరిన్నీ టీంలు కూడా అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టారు.

> **20 కాలనీలకు ముంపు సమస్య తప్పింది**
>
> గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందే అప్రమత్తం చేశాం. ఉప్పల్ సర్కిల్ పరిధిలో ముంపు బెడద లేకుండా కల్వర్టులపై బారి వంతెనలను నిర్మించాం. దీంతో దాదాపుగా 20 కాలనీల ప్రజలకు ముంపు సమస్య తప్పింది. నాలాల్లో సాఫీగా వరద నీరు వెళ్లడానికి ఇప్పటికే పూడికలు తీసి ఏలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నాం. ఎలాంటి సమస్య వచ్చినా మేము సిద్ధంగా ఉన్నాం.
>
> –ఈఈ నాగేందర్

భారీ వర్షాలు ఉండటంతో ప్రజలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయాల్లో 040–21111111,9001136675కు ఫోన్ చేసి ఫిర్యాదులను చెప్పాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

బోడుప్పల్: విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ మల్లయ్యనగర్ కాలనీలో నూతన ట్రాన్స్‌పార్మర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాన్స్‌పార్మర్లు, విద్యుత్ వైర్లు, త్రీ ఫేస్ కరెంట్ వంటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. తమ డివిజన్ పరిధిలో ఏమైన విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంతోష్, రామాంజనేయులు, అంజల్‌రెడ్డి, నాగభూషణం, శేఖర్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించిన స్పీకర్



అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు

మల్లాపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్‌లను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో మల్లాపూర్ అరుంధతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం వారు చేసిన సేవలు అజరామరమన్నారు. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌ల ఆశయ సాధన కోసం నేటితరం యువత కృషి చేయడంతోపాటు భవిష్యత్ తరాలకు కూడా తెలియజేయాలని వారు కోరారు. భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ పీడిత దళిత దీన జనుల కోసం చేసిన సంస్కరణలు ఎంతో గొప్పవి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, గ్రేటర్ బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్, వై. మల్లేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హెల్త్ క్యాంపు



ఉచిత హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు అన్నోజు కృష్ణ చారి

మేడిపల్లి: ఉరుకులు, పరుగుల నగర ప్రజల జీవితంలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించడం వల్ల ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతగానో దోహదపడుతుందని మేడ్చల్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు అన్నోజు కృష్ణ చారి అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం లేబర్ కార్డు ఉన్న సభ్యుల కోసం సీఎస్‌సీ హెల్త్ కేర్ సహకారంతో అధ్యక్షుడు అన్నోజు కృష్ణచారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు రెండు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డున్న ప్రతి ఒక్కరికి ఉచిత పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను తెలుసుకొని మందులు, అవసరమైన వైద్య సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కార్డున్న ప్రతి సభ్యుడు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ హెల్త్ క్యాంపులో అధిక సంఖ్యలో హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సభ్యులు సుజాత, కిరణ్, సంఘం ఉపాధ్యక్షుడు వడ్ల యాదయ్య, మామిడి యాదగిరి చారి, అన్నోజు మధన్ చారి, బన్నాల శ్రీనివాస్ చారి, తాడోజు సోమచారి, దోంతోజు సత్యనారాయణ, ప్రసన్న పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలి



ఘట్‌కేసర్: ఎస్టీ, ఎస్సీ, బీసీలకు రాజ్యాంగం ద్వారా హక్కులు ప్రసాదించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలని అంబేడ్కర్ జూనియర్ సంఘం అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనావిధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ప్రపంచం భారత్ వైపు చూస్తోందన్నారు.శ్రీనివాస్, కృష్ణ, శ్రీరామ్, భాస్కర్, నర్సింగ్‌రావు, సత్యం, శ్రీశైలం, మహేశ్, గణేశ్‌గౌడ్, జగదీశ్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పరుగుపందెంలో రమేష్ బాబుకు బంగారు పతకం

ఉస్మానియా యూనివర్సిటీ: పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన రమేష్ బాబును శాలిబండ సైక్లింగ్ క్లబ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓయూ సైక్లింగ్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. గత నెల గచ్చిబౌలి స్టేడియంలో పాన్ ఇండియా నిర్వహించిన క్రీడా పోటీలలో 65 సంవత్సరాల కేటగిరిలో 70 ఏళ్ల రమేష్ బాబు బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ 14 రాష్ట్రాల నుంచి 400 మంది పరుగుపందెంలో పోటీ పడగా తాను మొదటి స్థానం నిలిచి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో 17 పతకాలను సాధించినట్లు వివరించారు. తనను ప్రోత్సహించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలిబండ సైక్లింగ్ క్లబ్ అధ్యక్షులు భూపేందర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ సక్సేనా, కోశాధికారి అనురాగ్ రాజ్, దత్తాత్రేయ, కోచ్ కృష్ణ పాల్గొన్నారు.

మర్చిపోయిన ల్యాప్‌టాప్ అప్పగింత



అనిల్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్: రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడు మర్చిపోయిన ల్యాప్‌టాప్ ఇతర విలువైన వస్తువులను గుర్తించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు తిరిగి అప్పగించారు. మాదాపూర్‌లో నివాసముంటున్న అనిల్‌కుమార్ కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ఆదివారం మౌలాలి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు ఎక్కే హడావుడిలో తన ల్యాప్‌టాప్ బ్యాగును రైల్వేస్టేషన్‌లో వదిలి వెళ్లిపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ ఎస్ఐ కె.కిష్టయ్య, మహిళా కానిస్టేబుల్ రంజనా నామ్‌దేవ్ రూ.55 వేల విలువ చేసే వస్తువులు కలిగిన సదరు బ్యాగును గుర్తించి భద్రపరిచారు. అందు లోని పాన్‌కార్డు ఆధారంగా అనిల్‌కుమార్‌ను రప్పించి బ్యాగును అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎఫ్ అధికారులు మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 70 ఘటనల్లో రూ.19.50 లక్షల విలువ చేసే ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులు తిరిగి అప్పగించామన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి సుచిత్ర కాలనీలో శ్రీకర రాఘవేంద్ర హాస్పిటల్ ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ యువజన నాయకుడు కొంకట్ల రాహుల్ రెడ్డి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలు నిర్వహించిన హాస్పిటల్ యాజమాన్యం అభినందనీయమన్నారు.

సోదరిపై కర్రతో దాడి



తీవ్ర గాయంతో వాణి

ఉప్పల్: సోదరుడు సోదరికి మధ్య జరిగిన గొడవలో ఆవేశానికి లోనైన సోదరుడు కర్రతో దాడి చేయగా ఆమె తలకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. చిలుకానగర్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ యజమాని శివ శంకర్ ఇటీవల ఆయన తల్లి రమాదేవిని ఇంటి నుంచి గెంటివేయడంతో అధికారుల స్పందించి తిరిగి ఆమెను సొంత ఇంటికి క్షేమంగా చేర్చారు. ఈ క్రమంలోనే ఆదివారం తిరిగి శివ శంకర్ తన తల్లి ఉంటున్న చిలుకానగర్‌కు వచ్చి సోదరి వాణి (42), వృద్ధురాలైన తల్లితో గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలో మాటామాట పెరగటంతో ఆవేశానికి లోనైన శివశంకర్ సోదరి వాణిపై కర్రతో దాడి చేయడంతో ఆమె తలకు తీవ్ర గాయం అయింది. వెంటనే ఆమెను స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దాడికి పాల్పడిన శివ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మేడ్చల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలో నివాసం ఉంటున్న సర్కార్ రూపేశ్(25) గత కొంతకాలంగా గజాయిని విక్రయిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో రావల్‌కోల్ చౌరస్తా సమీపంలో ఓ వ్యక్తికి గంజాయి విక్రయించేందుకు వేచిఉండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచ 180 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పూడూరులోని అతని నివాసంలో తనిఖీ చేసి మేడ్చల్ పోలీసులకు నిందితుడిని అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య



మేడ్చల్ రూరల్: ఓ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన సికేంద్రకుమార్ (21), అతడి తమ్ముడు సునీల్‌కుమార్ 5 నెలల క్రితం వలస వచ్చి శామీర్‌పేట మండలం యాడారంలోని ఓ వ్యవసాయక్షేత్రంలో పనిచేస్తూ అక్కడే నివస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సికేంద్ర సింగ్ తన తల్లితో ఫోన్‌లో గొడవ పడుతూ మాట్లాడాడు. మరునాడు తెల్లవారుజామున వ్యవసాయక్షేత్రంలోని చింతచెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించిన మేడ్చల్ పోలీసులు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నీట్' అక్రమాలపై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ అక్రమాలపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షను నిర్వహించి ఫలితాల పది రోజులు ముందుగా ప్రకటించడం దారుణమన్నారు. పరీక్ష నిర్వహణ, ఫలితాల విడుదలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం

ఉప్పల్ సర్కిల్‌లోని 8 పరీక్ష కేంద్రాల్లో 2474 మంది అభ్యర్థులు హాజరు



రామంతాపూర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజేందర్ రెడ్డి



రామంతాపూర్ అరోరాల కళాశాల పరీక్ష కేంద్రానికి హాజరైన విద్యార్థులు



అల్వాల్ నారాయణ జూనియర్ కళాశాల వద్ద పరీక్షకు హాజరైన అభ్యర్థులు

ఉప్పల్/రామంతాపూర్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతం జరిగాయి. పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామంతాపూర్ ఓమెగా కాలేజీ మెఘా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాలను మేడ్చల్ మల్కాజగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి పరిశీలించిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అలాగే ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనిమిది కేంద్రాల్లో 3554 మంది అభ్యర్థులు ఉండగా అందులో 2474 అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు హాజరు కాని వారి జాబితాలో 1078 మంది అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. రామంతాపూర్ మెఘా డిగ్రీ కళాశాలలో మొత్తం 384 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 271 మంది, స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలో 360 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 250 మంది, వాగ్దేవి కళాశాలలో 408 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 291 మంది, ఆరోర కళాశాలో 720 అభ్యర్థులకు గాను 510 మంది హాజరయ్యారు. ప్రిన్స్‌టన్ కళాశాలలో ఏబిసి విభాగాల్లో 1320 అభ్యర్థులకు గాను 904 మంది, మెఘా జూనియర్ కళాశాలలో 360 అభ్యర్థులకు 248 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు భద్రతతో పాటు 144 సెక్షన్ విధించడంతో ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించామని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు.

ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు పరీక్షకు అనుమతించని అధికారులు

రామంతాపూర్ అరోరా పీజీ కళాశాలలో ఇద్దరు, ప్రిన్స్‌టన్, డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మెగా మహిళా డిగ్రీ కళాశాలలో ఒకరు అభ్యర్థులు ఆలస్యంగా పరీక్షకు హాజరు కావడంతో అధికారులు వారిని పరీక్షకు అనుమతించలేదు.

అల్వాల్‌లో...

అల్వాల్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో ప్రశాంతంగా జరిగాయి. అల్వాల్‌లో శ్రీచైతన్య, నారాయణ, ఆదర్శ కళాశాలలో పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే హాజరయ్యారు.

బీఆర్‌టీయూను బలపరచాలి : ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పారిశ్రామికవాడలోని రాణే ఇంజిన్ వాల్స్ కంపెనీలో గుర్తింపు యూనియన్‌గా ఉండి తిరిగి ఎన్నికలలో పోటీ చేస్తున్న బీఆర్‌టీయూను ఆ కంపెనీ కార్మికులు మరోసారి బలపరచాలని ఆ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంపెనీ కార్మికులతో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతూ నిత్యం వారి వెంట ఉన్న బీఆర్‌టీయూను గెలిపించాలని కోరారు. ఈ నెల 20న నిర్వహించే ఎన్నికలలో బీఆర్‌టీయూ ప్యానల్‌కు ఓటు వేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు విఠల్, నర్సింహాచారి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించకుంటే జలమండలి ముట్టడి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించకుంటే జలమడలి ముట్టడిస్తామని స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని మారుతినగర్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ పర్యటించి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేని యెడల డివిజన్ పరిధిలోని కాలనీల వాసులతో కలిసి జలమడలి ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మల్లేష్, శ్రీనివాస్, సురేష్, మల్లికార్జున్, అల్వాల్‌రెడ్డి, తోట మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అల్వాల్: బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని జై భీమ్ ఫైట్ ఫర్ రైట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు భగవంతుడు అన్నారు. జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా కౌకూర్, యాప్రాల్, లోతుకుంటలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బి.కృష్ణ, శ్యామ్‌రావు, అనంత్‌రాజ్, రమేష్, ఆస శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.